భగ్నహృదయము

శ్రీమతి కె.యస్. రాధామణిగారు

"అమ్మగారున్నారా ?"

"ఉన్నారండి."

"అయితే రామనాథం వచ్చాడని చెప్పు."

"చిత్తం" అని నౌకరు లోనికి వెళ్లాడు.

అప్పుడే కాలేజీనుంచి వచ్చింది జానకి. కాలేజీదుస్తులను మార్చుకొని షికారుకు తయారుగ ఉంది.

"అమ్మా రామనాథంగారొచ్చారు."

"రమ్మను."

"చిత్తం" అని రెండు మూడు వాకిండ్లు దాటి నౌకరు బైటికివచ్చేసరికి రామనాథం మోటారుకారునుండి దిగి విలాసంగ యింటివైపుచూస్తూ నిల్చున్నాడు.

"బాబూ ! దయచేయండి."

రామనాథం ప్రవేశించేటప్పటికి జానకి యెదురుగవెళ్లి ఆహ్వానించింది.

"అంత అవసరముగ వచ్చారేం ?"

'నేడు బీచిలో మంచి రేడియోప్రోగ్రాము అని. తొందరగపోవాలి."

"అయితే టీ పుచ్చుకొని వెళ్దాం రండి."

"అప్పుడే అయింది."

"మరొకసారి కానియ్యండి."

"సరే."

తొందరగ టీ పుచ్చుకొని జానకీరామనాథనులు కారులోకూర్చొని బీచికివెళ్లారు.

* * *

జానకి యింటర్మీడియేట్ సీనియర్ క్లాసున్నూ, రామనాథం బి. ఏ. సీనియర్ క్లాసూన్నూ ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుతున్నారు. రామనాథం కాలేజీలో గొప్ప వక్తవటంచేతను, అచటి ఆంగ్లసారస్వత సంఘ కార్యదర్శి యవటంచేతను, నాట్యకళలో యభిరుచికలవాడవటముచేతను, తఱచుగ కాలేజీమ్యాగజైన్‌కు వ్యాసాలు వ్రాస్తూయుండడముచేతను, ఇవన్నిటిని మించినట్లు అతని అందం ఆకర్షణీయముగ ఉండడముచేతను జానకీ హృదయం అతని నాకర్షించింది. రామనాథంకూడ జానకీ సుగుణాలనిచూచి యేలాగైనా, ఆమెతో స్నేహితం సంపాదించాలనుకొన్నాడు. ప్రథమ ప్రయత్నంగ ఆంగ్లసారస్వతసంఘ ఉపన్యాసములో పాల్గొనమనిప్రార్థించాడు. జానకి అతనికోరికను ఒప్పుకుంది. అప్పటినుండి సాయంత్రము టెన్నీసుఆటల్లో తనకు ఉద్దిగ యేర్పాటుచేసుకొని ఆడుతూ వచ్చారు కొన్నాళ్లు. కొన్నాళ్లకు స్నేహితం అనేది ప్రేమగ మారింది. రానురాను ప్రేమ మరింత పరిపక్వానికి వచ్చింది. ఒకరినొకరు పెండ్లిచేసుకోనేట్లు వాగ్దానాలు కూడ చేసుకొన్నారు. ఈసంగతి యేలాగైనా తమతండ్రులకు తెలియజేయాలనుకొన్నారు. జానకీప్రేమ రామనాథంలో లగ్నమైపోయింది. అతన్నితప్ప యితరులను పెండ్లాడనని నిర్ధారణచేసుకొంది.

జానకికి పదునెనిమిదేండ్లు దాటినవి. చిన్నప్పుడే తల్లి చనిపోయింది. ఏకైక పుత్రిక అవడముచేత తండ్రి అతిగారాబముగా పెంచాడు. జానకితండ్రి కృష్ణమూర్తిగారు మద్రాసులోని ఇంపీరియల్ బ్యాంక్ మేనేజరు. తనభార్య చనిపోయినప్పటినుండియు కూతురిమీద ప్రేమచేత మరల రెండోవివాహము చేసుకోలేదు. ఇంటిలో తాను తన కూతురుమాత్రము కాపురము. కృష్ణమూర్తిగారి కొక చెల్లెలు కూడ కలదు. ఆమెపేరు కనకమ్మ. జానకికి వయసువచ్చేవరకు శ్రద్ధగ చూచుకొంటూ యుండేది. అన్న చెల్లెండ్రకు యేదో ఆస్తి విషయములో కొట్లాటలువచ్చి కనకమ్మగారు తన ఆస్తినంతా అనాథ శరణాలయానికి ఖర్చుపెట్టి బెంగుళూరు వెళ్లింది. కృష్ణమూర్తిగారికి ఒకటేకోరిక. తన కూతురికి మంచి సంబంధాన్ని తెచ్చి పెండ్లిచేసి, అల్లున్ని తన యింటిలోనే పెట్టుకొని తన ఆస్తినంతా కూతురిపేరట వ్రాసి పెట్టాలని. అంచేత చిన్నప్పటినుండి జానకిని బాగా చదివించాడు. జానకికోసర మెంత ద్రవ్యమైనా వ్యయంచేయడానికి తీర్మానించుకొన్నాడు. బ్యాంకి వ్యవహారాల్లో నిమగ్నుడవటముచేతను, తీరికలేక పోవడముచేతను రామనాథను తన యింటికి వచ్చిపోయే సంగతి, జానకీరామనాథనుల ప్రేమనుగురించి కృష్ణమూర్తిగారి కంతగ తెలిసిందికాదు.

ఆరోజు కృష్ణమూర్తిగారి బ్యాంకుకు శలవు. తీరుబాటుగ యింట్లోనేయున్నాడు. జానకి సమయము చూచుకొని ఆనాడు రామనాథమును తండ్రికి పరిచయం చేయాలని అనుకుంది. అందుకోసర మొక టీపార్టీ యేర్పాటుచేసింది. కృష్ణమూర్తిగారు తన గదిలో పడకకుర్చీలో కూర్చొని పత్రికను చూస్తూవున్నాడు. జానకిగదిలో ప్రవేశించి "నాన్నా, నేడు టీపార్టీ యేర్పాటు చేశాను"అంది.

"ఎందుకు ?"

"ఈదినం మా కాలేజీస్నేహితుణ్ణి నీకు పరిచయంచేయాలని"

"ఎవరు ?"

"రామనాథం అను బి.ఏ.వి విద్యార్థి."

"ఎవరతను ?"

"బారిష్టర్ సర్వోత్తమరావుగారి కుమారుడు."

"ఆలాగా ! సరే ! బారిష్టరుగారు మన వాళ్లే, నాస్నేహితుడతను. అయితే అబ్బాయినిమాత్రం నేనెఱుగను."

"3 ఘంటలకు రమ్మన్నాను."

"సర్వోత్తమరావుగారినికూడ ఆహ్వానం చేస్తే బాగుంటుంది."

"అతన్ని నేనెఱగనే."

"నేను పిలిపిస్తాను. ఈదినం శలవు తప్పకవస్తాడు."

"సరే ఆలాగేచేయండి."

జానకికి మరింత ఆనందమయింది. ఉభయపక్షముల తండ్రులు కలుస్తారని.

తొందరగ నౌకర్లకుచెప్పి పార్టీకి తయారు చేయించింది.

3 ఘంటలకు సరిగ కృష్ణమూర్తిగారి యింటిముందర మోటారుకారు ఆగింది. రామనాథం సర్వోత్తమరావుగారు కారులో నుండి దిగునప్పటికి మోటారు శబ్దమును గుర్తించి జానకీ కృష్ణమూర్తిగార్లు బైటికి వచ్చి వారివారి స్నేహితుల నాహ్వానం జేసారు. వెంటనే జానకి రామనాథాన్ని తండ్రికి పరిచయంచేసింది. రామనాథంకూడ అలాగే జానకిని తనతండ్రికి పరిచయం చేసాడు. పార్టీ చాలా ఆనందంగ 6 ఘంటలవరకు జరిగింది. జానకీరామ నాథనులు శలవుతీసికొని సినిమాకు వెళ్లారు. కృష్ణమూర్తి సర్వోత్తమరావుగార్లు యింటి ముందర కాంపౌండులో పడకకుర్చీలలో కూర్చొని యేవో సంభాషణలకు పెట్టు కొన్నారు.

జానకి యేర్పాటుజేసిన టీపార్టీవలన ఒకరొకరికి సంబంధం మరింత సమీపానికి వచ్చింది. రామనాథాన్ని చూచేటప్పటికి కృష్ణమూర్తిగారికి జానకిని అతనికిచ్చి పెండ్లి చేయాలని కుతూహలం పుట్టింది. సర్వోత్తమ రావుగారితో యేదో వ్యావహారికానికి దిగ కుండా చక్కా సంబంధాలకు తీసుకొచ్చాడు. సంభాషణాన్ని. ఈ సంభాషణలో ఒక రొకరు సంబంధాలతో కలిసికొన్నట్టు తేలింది.

"అయితే మాఅమ్మాయిని మీఅబ్బా యికి చేసుకోరాదూ?" అన్నాడు కృష్ణ మూర్తిగారు.

"దానికేమికాని, మావానికి యిప్పుడే పెండ్లి చేయాలని అనుకోలేదు. ఇంగ్లాండుకు పంపాలనిఉంది. ఐ.సి.యస్ ప్యాసయినాక పెండ్లి ప్రయత్నంచేయాలి."

"అలాగేచేద్దాం. ఇప్పుడుమాత్రం మా అమ్మాయికేమి మించిపోయింది, మాట అయితేచాలు తర్వాతనే కానిద్దాం. ఇది గాక మా అమ్మాయికి మీ అబ్బాయికి చాలా పరిచయంకూడఉంది. ఒకరినొకరు ప్రేమించుకొన్నారన్నమాట."

"సరే అలాగేచేద్దాం. ఇక టైమ్ అయింది శలవు తీసుకొంటాను" అని సర్వోత్తమరావుగారు పైకిలేచాడు.

కృష్ణమూర్తిగారు పైకిలేచి సర్వోత్తమ రావుగారిచేతిలో చెయ్యిపెట్టి "అయితే యిదేమాట. చేతిలోచెయ్యికూడ వేస్తు న్నాను" అన్నాడు.

* * *

కొన్నినెలలు గడిచాయి. రామనాథం బి.ఏ. పరీక్షలో ఉత్తీర్ణుడయినాడు. జానకి కూడా యింటర్మీడియేటు ప్యాసయింది. సర్వోత్తమరావుగారనుకొన్నట్లు కుమారుని లండనుకు పంపడానికి యేర్పాట్లుచేసాడు. జానకి రామనాథంకు వీడ్కోలువిందు యేర్పాటుచేసి తనమనోగతఅభిప్రాయాన్ని బలపరిచింది. రామనాథంకూడ జానకిని

తప్ప యితరులను పెండ్లాడనని వాగ్దానం చేసాడు. జానకిని వీడలేక అతిప్రయాసతో వెళ్లిపోయాడు లండనుకు.

రామనాథం లండను చేరాడు. ఒకసంవత్సర కాలం యెడతెగక జాబులు విమాన టపా ద్వారా అతిశీఘ్రముగా వస్తూపోతూ వచ్చినవి. కాలక్రమమున పాశ్చాత్యనాగరకత చేతనో, లేక అచ్చటి పరిసరములవల్లనో, సాంఘికభేదాలచేతనో రెండో సంవత్సరములో జానకి వ్రాసిన లేఖలకు ప్రత్యుత్తరాలంతగవచ్చుట నిలిచిపోయింది. ఇంకొక ఆరుమాసాలకు పూర్తిగ లండనునుండి ప్రత్యుత్తరము వచ్చేదే నిలిచిపోయింది. జానకి వ్రాసివ్రాసి నిస్పృహ జెందింది. ఒక్క జాబునకుగాని బదులురాలేదు. విఫలమనోరథ అయింది జానకి. సర్వోత్తమరావు కృష్ణమూర్తిగార్ల మైత్రికూడ మునుపటి మాదిరిగాక రానురాను సన్నగిల్లింది. సర్వోత్తమరావుగారు వేరే ఘరానా కుటుంబములో సంబంధము ఏర్పాటు చేసుకొన్నాడని పరోక్షంగ కృష్ణమూర్తిగారికి తెలిసింది. ఈ సమాచారము విన్నంతనే కృష్ణమూర్తిగారికి పట్టరానంత రోషము వచ్చింది. తానుకూడ వేరొక సంబంధాన్ని తెచ్చి యతని కన్నులెదుటనే కూతురికి వివాహంచేయాలని అనుకొన్నాడు.

అనుకొన్న మేరకు గొప్ప వరదక్షిణ ఇచ్చుటకు ఒప్పుకొని పచ్చయ్యప్ప కళాశాల ప్రొఫెసర్‌గారి కొమారుడగు మోహనరావునకిచ్చి వివాహముచేయున ట్లేర్పాటు చేశాడు. ఈసంగతి జానకితో చెప్పాడు. సర్వోత్తమరావు మాటయిచ్చి తప్పినదానికి అతన్ని జానకి ముందు నిందించాడు. ఆ పాడుసంబంధం యెప్పటికైనా కష్టమేయని చెప్పాడు. తన తండ్రి యేర్పాట్లకు జానకి కేమియుచేయుటకు తోచలేదు. రామనాథను లండనునుండి వచ్చినపిమ్మట ముఖాముఖిగ అతని మనోగతాన్ని అడిగి తెలుసుకొందామని అనుకొంది. అంతవఱకు తండ్రి వివాహము ఆవుదలచేయనన్నాడు. ఇక వారమురోజులలో అయితీరాలని కూర్చున్నాడు. తన ప్రయత్నాలను మాటను దక్కించుకోవడానికి జానకిని మాటమాటికి నిర్బంధపెట్టుతున్నాడు.

కృష్ణమూర్తి మరల జానకివద్దకు వచ్చి, "జానకీ! తండ్రిమాట త్రోసివేయడమేనా? లేక వివాహానికి ఒప్పుకొంటావా?" అని ఆఖరుమాటగ అడిగాడు.

జానకికి మాటాడుటకు తోచలేదు.

"సరే! నీవు ఒప్పుకొన్ననుసరే! లేకున్ననుసరే. వివాహానికి యేర్పాటుఅయింది. నామాట దక్కించుకోవాలి" అని చెప్పి కృష్ణమూర్తి వెళ్లాడు.

అప్పటినుండీ జానకికి దిక్కుతోచలేదు. వంటవాడొచ్చి భోజనానికి రమ్మని పిలిచాడు. వద్దనింది. తన గదిలోనికి వెళ్లి సోఫాపై కూలబడింది. చాల దుఃఖించింది. ధైర్యము చేసింది. తనవిలువగల దుస్తులన్ని తీసివేసి సామాన్యదుస్తులను వేసికొని బైలుదేరింది.

సెంట్రల్ చేరింది. అప్పుడే బెంగుళూరుమెయిల్ తయారుగఉంది. టిక్కెట్టు తీసుకొని స్త్రీలపెట్టెలో వెళ్లి కూర్చొనింది.

"బెంగుళూరిలో కదా! మా మేనత్త కనకమ్మగారున్నారని మానాన్న చెపుతూ ఉన్నది. బహుశ యిప్పుడు మల్లేశ్వరములో ఉండాలి. ఆమెవద్దకుపోయి శరణు వేడుకొంటాను" అని యేమేమో యోచనలు చేసుకొంటూఉంది. బెంగుళూరు చేరింది. మల్లేశ్వర మెన్నిమార్లు చూచినా మన స్థైర్యంలేక రెండు మూడు రస్తాలు మార్చి మేనత్తగారిల్లు గుర్తించేటప్పటికి ఆమె ప్రాణాలు పైకెగసిపోనవి. కనకమ్మ చాలావగచి అలాంటిస్థితి రావడానికి కారణ మంతయు సాంతంగా సర్వమును వినింది. తమ్ముని కృత్యాన్ని నిందించింది.

జానకి యింటర్మీడియేటువరకు చదువుకొన్నదవటంచేత కనకమ్మగారికిగల పరిచయంతో, బెంగుళూరిలో వాణీవిలాస యిన్‌స్టిట్యూటులో జానకి కొక టీచరుపని యిప్పించింది. జానకికూడా చాలాశ్రద్ధగ పనిచేస్తూఉంది. విద్యార్థినుల ఆదరణ, టీచర్ల మెప్పు శీఘ్రకాలంలో సంపాదించింది. ఎప్పుడు తన విద్యావ్యాసంగాల్లోనే మునిగి తేలటంచేత జానకి తనవివాహ సంగతే పూర్తిగ మరచిపోయింది.

మద్రాసులో కృష్ణమూర్తిగారు ఆరోజు తెల్లవారిలేచి జానకితో మాట్లాడడానికి మరల జానకిగదికివెళ్లాడు. జానకి కనుపించలేదు. ఎక్కడెక్కడనో వెతకించాడు. పోలీసులో కంప్లెయింటుకూడా యిచ్చాడు. నెలరోజులైనను జానకిపోయిన పోకడ తెలిసిందికాదు. నిరాశచేసుకున్నాడు. తన మూర్ఖత్వాన్ని నిందించుకొన్నాడు. నిర్బంధంచేసినదానికి కూతుర్ని పోగొట్టుకొంటినని తన్నుతానే ఈసడించుకొన్నాడు. సముద్రములో పోయిదూకి ప్రాణములు పోగొట్టుకొందమని నిశ్చయము చేసుకొన్నాడు.

ఒకనాటిరాత్రి శరణాలయంలో తన గదిలో జానకిపడకపై పండుకొని "ఆంధ్రపత్రిక" చదువుకొంటూఉంది. ఆకస్మాత్తుగా ఆమెకన్నులకు మాలాలంకృతులగు నొక దంపతుల ఛాయాచిత్రము కనిపించింది. ఛాయాచిత్రమును చూస్తూనే చిత్రము దిగువ వ్రాసిన సమాచారాన్ని అత్యాతురముతో చదివింది.

"వరుడు మదరాసు నందు ప్రఖ్యాతిజెందిన హైకోర్టు న్యాయవాదియగు మ|| రా|| బారిష్టర్ యస్. సర్వోత్తమరావుగారి యేకైకపుత్రుడును, రామ్నాడుజిల్లా అక్టింగు కలెక్టరును అగు మ|| రా|| యన్. యస్. రామనాథం ఐ. సి. యస్. గారు.

కన్య మద్రాసు హైకోర్టుజడ్జీగారగు మ|| రా|| దివాన్‌బహదూర్ కె. యస్. రంగారావుగారి పుత్రికయగు శ్రీమతి సుశీలాదేవి బి.ఏ. గారు !"

జానకిచేతినుండి పత్రికనేలబడిపోయింది. స్మృతి దప్పిపోయింది.

తెల్లవారుసరికి కనకమ్మగారు "జానకీ! యింకా లేవలేదా. తెల్లవారింది" అని తలుపువద్దకువచ్చి తలుపుతట్టింది.

తలుపు వెంటనే వెనక్కు వెళ్లింది. లోపల నిశ్శబ్దము. పడకపైన యెవరూ లేరు. కనకమ్మగారు గాభరాపడి శరణాలయములో వెతకింది. ఎచ్చటను జానకి కనుపించలేదు. ఈ సమాచారము వెంటనే శరణాలయమంతా ప్రాకింది. జానకి యెచ్చటికి వెళ్లింది యేమయినది యెవరున్ను ఊహింపలేదు.

సాయింత్ర మవునప్పటికి ఆయూరి దిన పత్రిక "తాయినాడు"లో ఈరీతిగ పెద్ద అక్షరాలతో ఒకప్రకటన కనబడింది. శరణాలయంవాళ్లంతా గుంపుకూడి చదివారు.

ఆత్మహత్య

"మల్లేశ్వరము చెరువులో ఒక శవము తేలుచుండెను. పోలీసువారు దానిని బైటికితీయించి పరీక్ష చేసిరి. ఆవ్యక్తి వాణీవిలాస ఇన్‌స్టిట్యూట్ నందు ఉపాధ్యాయినిగ యుండెననియు అనాధశరణాలయపు మేనేజరగు కనకమ్మగారి కోడలనియు తెలియుచున్నది."

డోంగ్రే బాలామృతము

బలహీనమైన బిడ్డలకు పుష్టియున్ను, బలమున్ను, ఆరోగ్యము నిచ్చును. అన్నిస్థలములందు దొరకును.

మద్రాస్ ఏజంటు
ఏ. పి. పరేఖ్
268_చైనాబజారురోడ్డు
మద్రాసు.

ప్రొప్రయిటర్లు:—కె. టి. డోంగ్రే అండ్ కంపెని_బొంబాయి 4